
సాక్షి
విశాఖపట్నం
గురువారం । 12 । జనవరి । 2023



వీనుల విందుగా వీణానాదం 8లో



వందేభారత్ పరుగులు 8లో

న్యూస్‌రీల్

14న సింహగిరిపై సంక్రాంతి సంబరాలు

సింహాచలం : సింహగిరిపై ఈనెల 14న సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్టు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆరోజు ఉదయం రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో పెద్ద ఎత్తున భోగి మంటను వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. గొబ్బెమ్మలతో ముత్యాల ముగ్గులు, డూడూ బసవన్నల విన్యాసాలు, జంగం దేవర, కొమ్ముదాసరి, హరిదాసు వేషధారణలు, కపిలగోవు, కపిల గిత్త, ఎడ్లబండి, పూరిళ్లు, కుండల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆ రోజు 9 గంటలకు పిల్లలకు భోగిపళ్లు పోసే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఆసక్తిగల తల్లిదండ్రులు తమపిల్లలను సింహగిరిపై ఉన్న నృసింహమండపానికి తీసుకురావాలన్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సింహగిరిపై రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో 13వ తేదీ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు లేదా 14వ తేదీ ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు ముగ్గులు వేయాల్సి ఉంటుందన్నారు. 16వ తేదీ కనుమ రోజున శ్రీకృష్ణాపురంలోని గోశాలలో ఉదయం 9 గంటలకు గోపూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి రవి



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవికి జ్ఞాపిక అందజేస్తున్న పురోహిత్ అలంకారి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం ప్రసాదాన్ని, జ్ఞాపికను ఆలయ పురోహిత్ కరి సీతారామాచార్యులు న్యాయమూర్తికి అందజేశారు.

నేటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

విశాఖ విద్య: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలకు గురువారం నుంచి ఈ నెల 18 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. తిరిగి ఈ నెల 19న పాఠశాలలు ప్రారంభమవుతాయన్నారు. సమ్మెటివ్-1 పరీక్షల జవాబు పత్రాలు వాల్యూషన్ పూర్తి చేసి, పిల్లలకు ఈ నెల 20న ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దీనిపై ఉపాధ్యాయులంతా తగిన నివేదికలు సిద్ధం చేసుకోవాలన్నారు.

విజయవాడకు కలెక్టర్

సాక్షి, విశాఖపట్నం : కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున బుధవారం రాత్రి విజయవాడ పయనమయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కలెక్టర్లు, కమిషనర్లతో నిర్వహించనున్న సమీక్షకు కలెక్టర్ హాజరుకానున్నారు. శుక్రవారం చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి నిర్వహించే సమీక్ష సమావేశంలో పాల్గొననున్నారు. అనంతరం మూడు రోజుల పాటు ప్రభుత్వ సెలవులు ఉండటంతో.. సొంతూరులో సంక్రాంతి వేడుకల్ని కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించేందుకు వెళ్లనున్నట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. సోమవారం నుంచి ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు.

71 ప్రైవేట్ బస్సులపై కేసుల నమోదు

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): సంక్రాంతి పండగ దృష్ట్యా ప్రైవేటు బస్సులపై రవాణా శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. ఈ నెల 9 నుంచి బుధవారం వరకు 71 బస్సులపై కేసులు నమోదు చేశారు. మరో మూడు బస్సులను సీజ్ చేశారు. బుధవారం ఒక్క రోజే నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 26 బస్సులపై కేసులు నమోదు చేశామని డీటీసీ రాజారత్నం తెలిపారు. అధిక చార్జీల వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాకినాడ ఎక్స్‌ప్రెస్ నేడు రద్దు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): కాకినాడ-విశాఖపట్నం-కాకినాడ (మెము 17267/17268) ఎక్స్‌ప్రెస్‌ను వివిధ కారణాల వల్ల గురువారం రద్దు చేస్తున్నామని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

కొల్లాం స్పెషల్ మరో ట్రిప్పు పొడిగింపు

విశాఖపట్నం-కొల్లాం-విశాఖపట్నం (08567/08568)మధ్య నడుస్తున్న స్పెషల్ రైలును మరో ట్రిప్పు పొడిగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విశాఖపట్నం-కొల్లాం (08567) రైలు విశాఖలో ఈ నెల 22న బయల్దేరి, తిరుగు ప్రయాణంలో స్పెషల్ రైలు కొల్లాంలో 23న బయల్దేరుతుందని తెలియజేశారు.



బంగారం.. భారతదేశంలో దీని ఉత్పత్తి తక్కువైనా.. వినియోగంలో మాత్రం చైనా తర్వాత మనమే. ఉత్పత్తిలో ప్రపంచంలో 60వ స్థానంలో ఉన్న మనం, వినియోగంలో రెండో స్థానంలో ఉన్నాం. మనవారికి బంగారంపై ఎంత మక్కువో.. ఈ గణాంకాలు చాలు. అలంకరణతోపాటు, పెట్టుబడి సాధనంగా కూడా బంగారాన్ని ఎక్కువగా కొనుగోలు చేస్తుంటాం. దీన్ని ఆసరాగా తీసుకునే అడ్డదారుల్లో బంగారాన్ని దిగుమతి చేసుకుని, భారీ స్థాయిలో లాభాలార్జించేందుకు కొందరు వ్యాపారులు స్మగ్లింగ్ ముఠాలతో చేతులు కలుపుతున్నారు. విమానాశ్రయాల్లో ఆధునిక సాంకేతిక పరికరాలతో తనిఖీలు ముమ్మరంగా చేస్తుండటంతో కొత్త దారులు వెతుక్కున్నారు. విదేశాల నుంచి వయా కోల్‌కతా మీదుగా విశాఖ వ్యాపారుల చేతికి చేరుతున్న బంగారం స్మగ్లింగ్ తీరు అధికారుల్ని ఆశ్చర్యానికి గురిచేస్తోంది.



బంగారం స్మగ్లింగ్ నయా మార్గ్!

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

- బంగ్లాదేశ్ టు కోల్‌కతాకు స్మగ్లింగ్
- కోల్‌కతాలో విదేశీ మార్క్ చెరిపేస్తున్న వైనం
- అక్కడే కరిగించి బంగారు కడ్డీలుగా మారుస్తున్న స్మగ్లర్లు
- కోల్‌కతా నుంచి విశాఖకు సరఫరా.. స్థానిక వ్యాపారులకు విక్రయం

బంగారం స్మగ్లింగ్ రూటు మారింది. అటు చెన్నై, ఇటు హైదరాబాద్ విమానాశ్రయాల్లో నిఘా పెరిగి భారీగా బంగారం పట్టుబడుతుండటంతో స్మగ్లర్లు తమ రూటు కాస్తా మార్చారు. దుబాయ్ నుంచి బంగ్లాదేశ్‌కు.. అక్కడి నుంచి కోల్‌కతాకు తరలిస్తున్నట్టు సమాచారం. కోల్‌కతాలో విదేశీ బంగారం మార్కింగ్‌ను కాస్తా తొలగించి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో విశాఖపట్నానికి తరలిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో కోల్‌కతాలోని స్మగ్లింగ్ ముఠాతో పాటు విశాఖలోని కొందరు బంగారు వ్యాపారస్తులు కూడా చేతులు కలిపినట్టు తెలుస్తోంది. తక్కువ ధరకే బంగారం దొరుకుతుండటంతో పాటు ఎటువంటి పన్నులు లేకుండానే వ్యాపారం చేసుకునే వీలుండటంతో రోజురోజుకీ స్మగ్లింగ్ వ్యవహారం పెరుగుతున్నట్టు సమాచారం. తాజాగా రూ.1.07 కోట్ల విలువైన 1.86 కేజీల బంగారాన్ని కోల్‌కతా నుంచి తరలిస్తుండగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు తాజాగా విశాఖ రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నారు. గతంలోనూ ఏకంగా 30 కేజీల బంగారాన్ని ఇదే తరహాలో పట్టుకున్నారు. బంగారంపై కేంద్రం కస్టమ్స్ డ్యూటీని 7.5 శాతం నుంచి 12.5 శాతానికి పెంచడంతో పాటు అదనంగా 2.5 శాతం వ్యవసాయ మౌలిక సదుపాయాల సెస్‌ను విధిస్తుండటంతో బంగారం స్మగ్లింగ్ పెరుగుతున్నట్టు డీఆర్ఐ అధికారులు భావిస్తున్నారు. విమానాశ్రయాల్లో నిఘా పెరగడంతో బంగ్లాదేశ్ తీరానికి ఆనుకుని పశ్చిమబెంగాల్‌కు తరలించే మార్గాన్ని స్మగ్లర్లు ఎంచుకున్నట్టు తెలుస్తోంది.

మయన్మార్ టు బంగ్లాదేశ్..!

వాస్తవానికి బంగారం స్మగ్లింగ్ వ్యవహారం అరబ్ దేశాల నుంచి జరుగుతోంది. అరబ్ నుంచి మయన్మార్‌కు, అక్కడ నుంచి బంగ్లాదేశ్‌కు సులువుగా చేరుస్తున్నారు. బంగ్లాదేశ్‌తో పశ్చిమబెంగాల్‌కు సువిశాల తీరప్రాంతం ఉంది. ఇక్కడ అనునిత్యం గస్తీ చేయడం కూడా కష్టసాధ్యంగా ఉంటోంది. సులభంగా చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో బంగారం ఎక్కువగా చేతులు మారుతోంది. అందుకే ఈ మార్గాన్ని స్మగ్లర్లు ఎన్నుకున్నట్టు డీఆర్ఐ అధికారులు అంచనా వేశారు. స్థానికులు కూడా ఈ బంగారం స్మగ్లింగ్ వ్యవహారంలో ఉపాధి పొందడంతో పాటు భారీగా డబ్బును ఆర్జించడంతో వారికి సహకరిస్తున్నట్టు డీఆర్ఐ అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. భారత్ దాదాపు రూ.2 లక్షల కోట్ల విలువైన బంగారాన్ని ఏటా దిగుమతి చేసుకుంటుంది. డీఆర్ఐ అధికారుల అంచనాల ప్రకారమే 2019-20ల్లో 120 టన్నుల బంగారం స్మగ్లింగ్ జరిగింది. వాస్తవానికి 500 గ్రాముల బిస్కెట్‌ను రవాణా చేస్తే 3.5 లక్షల మేర లాభాన్ని ఆర్జించే అవకాశం ఉందని తెలుస్తోంది.

కోల్‌కతా కేంద్రంగా..!

విదేశాల నుంచి వచ్చే బంగారానికి అక్కడి అధికారిక ముద్ర(సీల్) ఉంటుంది. కోల్‌కతాలో దీన్ని కరిగిస్తున్నారు. ఆ తర్వాత బంగారం పీసులు, బార్లుగా వివిధ రూపాల్లో మారుస్తున్నారు. ఈ వ్యవహారమంతా కోల్‌కతాకు చెందిన బంగారం స్మగ్లర్లు చేస్తున్నారు. అక్కడి నుంచి వివిధ మార్గాల్లో బంగారాన్ని తరలిస్తున్నారు. బోస్, ఆద్య.. ఇలా వివిధ మారు పేర్లతో ఉన్న కోల్‌కతా బంగారం స్మగ్లర్లు ఈ వ్యవహారాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఈ వ్యవహారాల్లో ఆదాయం దండిగా ఉండటంతో స్థానికులు స్మగ్లర్లకు బాగా సహకరిస్తున్నట్టు డీఆర్ఐ అధికారులు పేర్కొంటున్నారు. కోల్‌కత్తా నుంచి విశాఖకు రోడ్డు, రైల్వే మార్గంలో ఈ అక్రమ బంగారాన్ని తరలిస్తున్నారు. అక్కడి నుంచి వచ్చిన స్మగ్లింగ్ బంగారాన్ని విశాఖలోని కొందరు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

విశాఖ వ్యాపారులకూ లింకులు!

ఉత్తరాంధ్రతో పాటు తూర్పు గోదావరి జిల్లాల ప్రజలు బంగారం కొనుగోలుకు విశాఖపట్నం కేంద్రంగా ఉంది. ఇక్కడ బంగారం వ్యాపారం భారీగా జరుగుతోంది. ఇక్కడ కొద్ది మంది బంగారం వ్యాపారులు కూడా ఈ స్మగ్లింగ్ బంగారాన్ని విక్రయిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. సులభంగా తక్కువ ధరకే బంగారం దొరుకుతుండటంతో పాటు ఎటువంటి పన్నులు లేకుండా వ్యాపారం చేసుకునే వీలుండటంతో స్మగ్లర్లతో వీరు చేతులు కలిపినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై కూడా డీఆర్ఐ అధికారులు ఆరా తీస్తున్నట్టు సమాచారం. డీఆర్ఐ దర్యాప్తులో మరిన్ని విషయాలు బయటపడే అవకాశం ఉంది.

నేటి నుంచి అరకు 'ఇన్‌స్టెంట్' ఘుమఘుమలు

- 50, 100 గ్రాముల టిన్స్‌లో లభ్యం
- ఈ నెలాఖరు నాటికి బ్లెండెడ్ సాచెట్స్



విడుదలకు సిద్ధమైన ఇన్‌స్టెంట్ కాఫీ టిన్స్

సాక్షి, విశాఖపట్నం: అంతర్జాతీయ కాఫీ మార్కెట్లో తనకంటూ ప్రత్యేకతను సంతరించుకున్న అరకు కాఫీ నుంచి ఇన్‌స్టెంట్ కాఫీ ఘుమఘుమలు మూడేళ్ల విరామం తర్వాత మార్కెట్‌లో పలకరించనున్నాయి. ఇప్పటికే గిరిజనుల నుంచి 10 శాతం కంటే తక్కువ తేమ ఉన్న కాఫీ పండ్లను సేకరించి, మంచి రుచితోపాటు, సువాసన తోడయ్యేలా రోస్టింగ్, ఇతర ప్రక్రియలతో ఇన్‌స్టెంట్ కాఫీ పొడగా మార్చారు. తొలి విడతగా.. టిన్స్‌ని మార్కెట్‌లో గురువారం నుంచి విక్రయించేందుకు గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ఏర్పాట్లు చేసింది. మొత్తం మూడు రకాలుగా ఇన్‌స్టెంట్ కాఫీ రుచులు వినియోగదారులకు పరిచయం చేస్తున్నట్టు జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ తెలిపారు. తొలి దశలో 100 శాతం ప్యూర్ ఇన్‌స్టెంట్ కాఫీ రుచిని 50 గ్రాములు, 100 గ్రాముల టిన్స్ రూపంలో మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. మొత్తం 20 వేల టిన్నుల్ని సిద్ధం చేశామని, గురువారం ఉదయానికి విశాఖ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు తెలిపారు. 60-40 బ్లెండెడ్ కాఫీ, 2 గ్రాములు, 10 గ్రాముల సాచెట్స్ రూపంలో ఈ నెలఖారున గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గిరిజనులకు లాభాల్ని అందించేలా జీసీసీ ప్రతి నిర్ణయం తీసుకుంటోందని గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి స్పష్టం చేశారు.

చిరు వ్యాపారులకు జగనన్న తోడు

- ఆరో విడత రుణ సాయం ఖాతాల్లో జమ
- జిల్లాలో రూ.8.17 కోట్లు రుణ సాయం
- వడ్డీ మాఫీ కింద రూ.67.55 లక్షలు



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, మేయర్ హరివెంకట కుమారి, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్సీ రవీంద్రబాబు

సాక్షి, విశాఖపట్నం : చిరు వ్యాపారుల జీవనోపాధికి తోడుగా.. ఆర్థిక భరోసా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న తోడు పథకం.. వారి జీవితాల్లో వెలుగులు నింపిందని జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, అనకాపల్లి ఎంపీ డా.భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. జగనన్న తోడు పథకం ద్వారా 2023 సంవత్సరానికి గాను రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు వరుసగా ఆరో విడత రుణ సాయం కార్యక్రమాన్ని బుధవారం ఉదయం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా విశాఖపట్నం జిల్లాకు సంబంధించి 8,166 మంది లబ్ధిదారులకు జగనన్న తోడు పథకం కింద రూ.8.17 కోట్ల లబ్ధి చేకూరింది. అదే విధంగా జిల్లాలో రుణ సాయం సక్రమంగా చెల్లించిన 26,297 మంది లబ్ధిదారులకు వడ్డీ మాఫీ కింద మొత్తం రూ.67.55 లక్షలు వారి ఖాతాలకు చేరింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్‌లో జగనన్న తోడు లబ్ధిదారులతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులు, ఫుట్‌పాత్ వ్యాపారులు, హస్తకళలపై ఆధారపడే వారికి రూ.10 వేల వరకూ వడ్డీ లేని రుణాల్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లాలోని లబ్ధిదారులకు మెగా చెక్కుల రూపంలో కలెక్టర్ మల్లికార్జున, మేయర్ హరివెంకటకుమారి, అనకాపల్లి ఎంపీ డా.సత్యవతి, ఎమ్మెల్సీ రవీంద్రబాబు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సంఘాల మహిళలు కూరగాయల స్టాళ్లను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభారాణి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జి పూర్ణిమాదేవి, జీవీఎంసీ యూసీడీ పీడీ పాపునాయుడు, డీఎంసీ నాగరాజు, బ్యాంక్ అధికారులు, మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

అనధికారిక నిర్మాణాలపై కఠిన చర్యలు

- ప్లాన్, అనుమతుల ప్రకారమే పనులు
- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): నగరంలో అనధికారిక నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్లాన్, అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలు తొలగిస్తామని స్పష్టం చేశారు. ప్లాన్ తీసుకున్నవారు ఆ ప్రకారం భవనాలు నిర్మించాలని, విరుద్ధంగా పనులు చేపట్టవద్దని సూచించారు. భవన నిర్మాణ సామగ్రిని ప్రజలకు ఇబ్బంది కలిగేలా రోడ్లపై వేయరాదన్నారు. పాత భవనాలను తొలగించి ఆ వ్యర్థాలను రోడ్డు పక్కన, ఖాళీ స్థలాల్లో వేస్తే ఆయా వాహనాలను సీజ్ చేస్తామన్నారు. భవన యజమాని నుంచి అపరాధ రుసుం కూడా వసూలు చేస్తామని తెలిపారు. ఫుట్‌పాత్‌లపై బడ్డీలు, టిఫిన్ బళ్ల వంటి దుకాణాలు ఏర్పాటు చేసి ప్రజలకు అసౌకర్యం కలిగించరాదన్నారు. సెల్లార్లను వ్యాపారాలకు ఉపయోగించకుండా వాహనాల పార్కింగ్‌కు కేటాయించాలన్నారు. సెల్లార్లను వ్యాపార సంస్థలుగా మార్చితే చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. రాజకీయ పార్టీల సభలు, వివిధ ఫంక్షన్లు, పండగలకు జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతి లేకుండా రోడ్లను తవ్వి, హోర్డింగులు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవన్నారు.

విజయవాడకు జీవీఎంసీ కమిషనర్

మార్చి 28, 29 తేదీల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించనున్న జీ-20 సదస్సు కోసం పలువురు ఉన్నతాధికారులతో చర్చించేందుకు జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు విజయవాడ వెళ్లారు. ఈ సదస్సు కోసం నగర సుందరీకరణ, విద్యుత్, రోడ్ల మరమ్మతులు వంటి పనులు జీవీఎంసీ చేపట్టాల్సి ఉంది. ఇందులో భాగంగా బీచ్ రోడ్డులో పారిశుధ్యం, భూగర్భ డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి, రోడ్లు, కాలువలు, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, పెయింటింగ్‌లు వంటి సుందరీకరణ పనుల విషయమై పలువురు అధికారులు, ముఖ్య కార్యదర్శులతో కమిషనర్ చర్చించనున్నారు.

పీవీ చలపతిరావు సేవలు స్ఫూర్తిదాయకం

- సంస్మరణ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



చలపతిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

ఎంవీపీ కాలనీ(విశాఖ తూర్పు): బీజేపీ సీనియర్ నాయకుడు పీవీ చలపతిరావు ఆరు దశాబ్దాల పాటు నిర్విరామ సేవలు అందించి స్ఫూర్తిదాయకంగా నిలిచారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. ఏయూ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం చలపతిరావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర తొలి అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి చలపతిరావు చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. ఎమర్జెన్సీ సమయంలో జైలు జీవితం గడిపి కూడా పార్టీ కోసం నిబద్ధతతో పని చేశారన్నారు. ఎంపీ జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ తొలితరం నాయకుల్లో చలపతిరావు ఒకరన్నారు. ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ బీజేపీలో ఏపీ రాజకీయాలకు చర్చకు వస్తే ప్రధానంగా వినిపించేది పీవీ చలపతిరావు పేరే నన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత కార్యకారిణి సభ్యుడు భాగయ్య మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాలే చలపతిరావును రెండుసార్లు ఎమ్మెల్సీగా గెలిపించాయన్నారు. చలపతిరావు తనయుడు, ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ కార్యక్రమానికి హాజరైన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సభలో బీజేపీ జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, జిల్లాకు చెందిన పలు పార్టీల నాయకులు, ఉన్నతాధికారులు పాల్గొని చలపతిరావు చిత్రపటం పూలు వేసి అంజలి ఘటించారు.

విశాఖలో ఐఏఎస్ ట్రైనీ అధికారుల బృందం



కలెక్టర్ మల్లికార్జునతో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

సాక్షి, విశాఖపట్నం: ఆలిండియా సర్వీసెస్ ఐఏఎస్ ట్రైనీ అధికారుల బృందం విశాఖపట్నంలో పర్యటించింది. 22 మంది అధికారులు 4 రోజుల పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌కు బుధవారం చేరుకున్నారు. కలెక్టర్ మల్లికార్జున, జేసీ కేఎస్ విశ్వనాథన్‌తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. జిల్లాలో ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థల్ని బృందం సందర్శించనుంది. అలాగే పలు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్నారు. అనంతరం ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం విశాఖపట్నం పోర్టు అథారిటీని సందర్శించింది. పోర్టు చైర్మన్ రామ్మోహన్‌రావుతో వారు భేటీ అయ్యారు. పోర్టులో అందిస్తున్న మౌలిక సదుపాయాల గురించి చైర్మన్ వివరించారు.

కంటి ఆస్పత్రిలో కార్పొరేట్ వైద్య సేవలు

- కలెక్టర్ నిధులతో ఆస్పత్రికి నిరంతరం విద్యుత్ సరఫరా
- హెచ్‌పీసీఎల్ సీఎస్సార్ నిధులు రూ.కోటి మంజూరు
- ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర



సీతంపేట(విశాఖ ఉత్తర): ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రికి సమకూరనున్న అత్యాధునిక పరికరాలతో కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర తెలిపారు. స్థానిక రామాటాకీస్ రోడ్‌లో ఉన్న ఆస్పత్రిలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు చేపడుతున్నారన్నారు. దీనిలో భాగంగా కలెక్టర్ మల్లికార్జున మంజూరు చేసిన రూ.25 లక్షల నిధులతో ఆస్పత్రిలో నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన 250 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, 620 కేవీ జనరేటర్ ఏర్పాటు చేశామని చెప్పారు. దీంతో ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్లు, ఓపీ, వార్డుల్లో నిరంతర విద్యుత్ సరఫరా సౌకర్యం లభించిందన్నారు. అలాగే కంటి పరీక్షలకు ఉపయోగించే మూడు స్లిట్‌ల్యాంపులు సమకూరాయని, వీటిని త్వరలో కలెక్టర్‌తో ప్రారంభిస్తామన్నారు.

హెచ్‌పీసీఎల్ నిధులతో ఆధునిక పరికరాలు

కలెక్టర్ చొరవతో హెచ్‌పీసీఎల్ కంపెనీ సీఎస్సార్ కింద ఆస్పత్రి అభివృద్ధికి కోటి రూపాయల నిధులు మంజూరు చేసినట్టు విశ్వామిత్ర తెలిపారు. రూ.28 లక్షలతో గ్లకోమా వ్యాధిగ్రస్తుల్లో దృష్టి సామర్థ్యాన్ని అంచనా వేసే అత్యాధునిక 'విజువల్ ఫీల్డ్ ఎనలైజర్' కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. రెటీనా సంబంధిత ఆపరేషన్స్, క్యాటరాక్ట్ ఆపరేషన్స్ నిర్వహించడానికి అవసరమైన ఫేకో మిషన్‌ను రూ. 60 లక్షలతో కొనుగోలు చేస్తున్నామన్నారు. రూ.15 లక్షలతో స్పెషల్ మైక్రో స్కోప్ అందుబాటులోకి తెస్తున్నట్టు తెలిపారు. కొద్ది రోజుల్లో సమకూరనున్న ఈ పరికరాలతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో లభిస్తున్న ఎంతో ఖరీదైన వైద్య సేవలు ప్రభుత్వ కంటి ఆస్పత్రిలో 90 శాతం వరకు అందుబాటులోకి వస్తాయన్నారు.

త్వరితగతిన వైద్య సేవలు

ఆస్పత్రికి వచ్చే రోగులకు త్వరితగతిన వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఆమె తెలిపారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి పోస్ట్ ఆపరేషన్ టెస్టుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కౌంటర్‌లో స్పెషలిస్ట్ వైద్యులు, స్లిట్ ల్యాంప్ అందుబాటులో ఉంటుందని, దీనివల్ల అర్ధ గంటలో వైద్య పరీక్షలు పూర్తి చేసి పంపిస్తామన్నారు.

సెకండ్ ఒపీనియన్ సేవలు

కంటి వైద్యానికి సంబంధించి సర్జరీలు, వైద్య పరీక్షల విషయంలో రోజూ ఎంతో మంది సలహాలు, సూచనల కోసం ఆస్పత్రికి వస్తుంటారని సూపరింటెండెంట్ తెలిపారు. అటువంటి వారి కోసం ప్రతి శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రతి స్పందన సేవలు అందిస్తామన్నారు. నిపుణులైన వైద్యులు సెకండ్ ఒపీనియన్ సేవలు, సలహాలు ఇస్తారన్నారు.

శంకర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



రోగులకు కళ్ల అద్దాలు, డ్రైఫ్రూట్స్ అందజేస్తున్న శారదా పీఠాధిపతులు

సింహాచలం: సర్వేంద్రియాల్లో కన్ను ప్రధానమైందని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. వేపగుంటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి 4 లక్షల శస్త్రచికిత్సలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆస్పత్రి ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సభలో శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి పాల్గొన్నారు. తొలుత ఆస్పత్రి ప్రాంగణంలో మొక్క నాటారు. అనంతరం స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. అవయవ దానాల్లో నేత్రదానం ఎంతో గొప్పదన్నారు.

మహనీయుడు శంకరరావు

25 సంవత్సరాలుగా పశ్చిమ గోదావరి నుంచి శ్రీకాకుళం వరకు, ఒడిశా రాష్ట్రంలో ఎన్నో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పేదలకు కంటి చూపు అందించిన ఘనత శంకర్ ఫౌండేషన్‌కి దక్కుతుందన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు స్వర్గీయ శంకరరావు మహనీయుడని కొనియాడారు. ఈ సందర్భంగా శస్త్రచికిత్సలు చేయించుకున్న పలువురికి కళ్లద్దాలు, డ్రైఫ్రూట్స్, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి డీజీఎం బంగార్రాజు, ఏజీఎం వేణుగోపాల్, దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు

శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ద్వారా నాలుగు లక్షల శస్త్రచికిత్సలు పూర్తి చేయగలిగామంటే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సహకారం వల్లనే సాధ్యమైందని ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ మణిమాల తెలిపారు. సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రిలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ ద్వారా చాలామంది పేదలకు సంతోషంగా సేవ చేస్తున్నామన్నారు. చాలా స్వచ్ఛంద సంస్థలు, టీటీడీ కూడా ఎంతో సహకరించాయని తెలియజేశారు.

క్లుప్తంగా

సీపీఎస్ యాక్టివిటీస్‌లో విశాఖకు శతశాతం మార్కులు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్మార్ట్‌సిటీస్‌లో చేపట్టిన సీపీఎస్ యాక్టివిటీస్–2022లో విశాఖకు శతశాతం మార్కులు వచ్చాయి. బిల్ బోర్డ్స్ అండ్ హోర్డింగ్స్‌లో 10/10, వాల్ గ్రాఫిటీలో 20/20, క్యాంపెయిన్‌లో 10/10, రిఫరల్ సర్వే ప్రమోషన్‌లో 20/20, ప్రింట్ మీడియాలో 10/10, డిజిటల్ మీడియాలో 10/10, ఇన్నోవేటివ్ ఇనీషియేటివ్‌లో 20/20.. మొత్తంగా 100కి 100 మార్కులు లభించాయి. విశాఖతో పాటు రాష్ట్రంలో విజయవాడ, గుంటూరు నగరాలు కూడా శత శాతం మార్కులు సాధించాయి. దేశంలో అగర్తాలా, ఆగ్రా, ఆలీఘర్, బెంగళూరు, భోపాల్, చండీఘర్, చెన్నై, గ్వాలియర్, ఇంఫాల్, ఇండోర్, జామ్‌నగర్, ఝూన్సీ, లక్నో, కాన్పూర్, నేవీ ముంబయి, పూణే, థానే, తదితర 40 నగరాలు శత శాతం మార్కులు దక్కించుకున్నాయి.

మనోహరమూర్తి ఇక లేరు

విశాఖ స్పోర్ట్స్ : ఏయూ వ్యాయామ విద్య విభాగపు పీడీ జి.మనోహరమూర్తి(81) అనారోగ్యంతో బుధవారం మరణించారు. ఆయన 1960వ దశకంలో అంతర్ వర్సిటీల టోర్నీల్లో బ్యాడ్మింటన్, టెన్నిస్ రెండింట ప్రాతినిధ్యం వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మృతికి ఏయూ ఫ్యాకల్టీ సభ్యులు సంతాపం తెలిపారు.

15 మందికి కారుణ్య నియామకాలు

అల్లిపురం(విశాఖ దక్షిణ): పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో మరణించిన హోంగార్డుల కుటుంబ సభ్యులకు బుధవారం కారుణ్య నియామకాలు చేపట్టారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ 15 మంది అభ్యర్థులకు సీ కేటగిరి ద్వారా నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్, ఏవో, హోంగార్డ్స్ ఆర్ఐలు పాల్గొన్నారు.

బడిలో విందు భోజనం!

- విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ
- రోజుకో వంటకంతో జగనన్న గోరుముద్ద
- వారంలో మూడు సార్లు పసందైన చిక్కీ
- విశాఖ జిల్లాలో 588 పాఠశాలల్లో అమలు
- 87,500 మంది విద్యార్థులకు ప్రయోజనం
- మారిన మెనూ, సంక్రాంతి తరువాత అమలు




పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: విద్యార్థులకు నాణ్యమైన చదువులతో పాటు, వారి ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో రోజుకో వంటకంతో పసందైన విందు భోజనం తలపించేలా జగనన్న గోరుముద్ద అందిస్తున్నారు. ఇది మరింత రుచికరంగా ఉండేలా ఇక నుంచి గురువారం టమోటా చట్నీతో లెమన్ రైస్ అందించేలా తాజాగా మెనూ మార్పు చేశారు. బుధవారం దీనిపై ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయగా, సంక్రాంతి సెలవుల తరువాత పాఠశాలల్లో అమలు చేసేలా జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. భోజన పథకం సమర్థవంతంగా అమలయ్యేలా పర్యవేక్షణ పెంచారు.

జిల్లాలో 588 పాఠశాలల్లో..

విశాఖ జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని 588 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తుండగా, 87,500 మంది విద్యార్థులు దీని ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇందులో 388 పాఠశాలల్లోని 47,010 మంది విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజనం అందిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే రాగిమాల్ట్ అందించేలా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రుచి..ఎంతో శుచి

విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించటంతో పాటు, పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచేలా విద్యాశాఖ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో 664 మంది ఆయాలను నియమించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే ఆయాల నియామకం జరిగింది. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.6 వేలు వేతనం చెల్లిస్తున్నారు. జిల్లాలో 976 మంది వంట నిర్వాహకులు పనిచేస్తుండగా, వీరికి టీడీపీ హయాంలో నెలకు రూ. 1000లను మాత్రమే ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వీరి గౌరవ వేతనం రూ. 3 వేలుకు పెంచారు.

మెనూ ఇలా..

సోమవారం: హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు/ పలావ్‌తో ఎగ్‌కర్రీ, వేరుశనగ చిక్కీ
మంగళవారం: దొండకాయ చట్నీతో చింతపండు పులిహోర, ఉడికించిన గుడ్డు
బుధవారం: కూరగాయల అన్నం, బంగాళదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
గురువారం: సాంబార్ బాత్ లేదా టమాటా చట్నీతో నిమ్మకాయ రైస్, ఉడికించిన గుడ్డు
శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గడ్డు, వేరుశనగ చిక్కీ
శనివారం: ఆకుకూర అన్నం, పప్పు చారు

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత



విద్యార్థులు ఆరోగ్యంగానే ఉంటేనే చదువులపై దృష్టి సారించగలరు. అందుకనే ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకం అమలుకు తగిన నిధులు కేటాయింపు చేస్తోంది. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పటిష్టంగా అమలయ్యేలా పర్యవేక్షణ పెంచాం.
– ఎల్. చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

గోరుముద్ద బాగుంది



గోరుముద్ద ఎంతో రుచిగా ఉంది. ప్రతీ రోజూ మా బడిలో వేడి వేడి భోజనం పెడుతున్నారు. చాలా ఇష్టంగా తింటున్నాం. చిక్కీ కూడా ఇస్తున్నారు. మా ఫ్రెండ్స్ అందరం కలసి బడిలోనే భోజనం చేసేందుకు ఇష్టపడతాం.
– బి.కుసుమ, విద్యార్థిని, ప్రకాశరావు పేట

విశాఖ చేరుకున్న జనసేనాని



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న పవన్ కల్యాణ్

గోపాలపట్నం : జనసేన అధినేత పవన్ కల్యాణ్ బుధవారం విశాఖ చేరుకున్నారు. రాత్రి 8.30 గంటల సమయంలో ఆయన ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయంలో దిగారు. ఇక్కడి నుంచి రోడ్డు మార్గాన భోగాపురం సన్‌రైజ్ గెస్ట్ హౌస్‌కు బయలుదేరి వెళ్లారు. శ్రీకాకుళం జిల్లాలో గురువారం నిర్వహించనున్న పార్టీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు.

వందేభారత్ పరుగులు



రైలు లోపల భాగం

తాటిచెట్లపాలెం: అత్యంత వేగంగా నడిచే వందేభారత్ రైలు బుధవారం విశాఖపట్నం చేరుకుంది. చెన్నైలో గల ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ నుంచి ప్రాథమిక నిర్వహణ నిమిత్తం ఈ రైలు ఇక్కడికి వచ్చింది. దీనిని నిర్వహణ నిమిత్తం కోచింగ్ కాంప్లెక్స్‌కు పంపించారు. తదుపరి ఆదేశాలు వచ్చిన తరువాత ఈ రైలును సికింద్రాబాద్ పంపించనున్నట్లు అధికారులు తెలిపారు.

వందేభారత్ ప్రత్యేకతలు

- ఈరైలు బయట నుంచి చూడడానికి విమానాన్ని పోలి ఉంటుంది. మిగిలిన రైలు కోచ్‌ల కంటే ఇవి తేలికైనవి.
- మొత్తం 16 కోచ్‌లు, 1128 సీటింగ్ సామర్థ్యం, మొత్తం శీతల కోచ్‌లు.



- మధ్యలో గల రెండు కోచ్‌లు మొదటి తరగతి కోచ్‌లు, ఇవి 52 సీటింగ్ సామర్థ్యం కలిగి ఉంటాయి. మిగిలిన కోచ్‌ల్లో మాత్రం విమానం మాదిరిగా 78 రిక్లైనింగ్ సీట్లు ఉంటాయి.
- ఈ కోచ్‌ల పొడవు 23 మీటర్లు, మొత్తం రైలు ఫ్రేమ్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో నిర్మించబడింది.
- ఆటోమెటిక్ ఇంట్రీ, ఎగ్జిట్ స్లైడింగ్ డోర్స్, వ్యక్తిగతంగా చదువుకునేందుకు వీలుగా లైటింగ్ సదుపాయం, మొబైల్ చార్జింగ్ పాయింట్స్, సహాయకుడిని పిలిచే సదుపాయం, బయో టాయ్‌లెట్స్, సీసీ టీవీ కెమెరాలు, రీ సైక్లింగ్ సదుపాయాలు
- దీని ప్రయాణ గరిష్ట వేగ పరిమితి గంటకు 160 కి.మీ.

భీమవరంలో 23, 24 తేదీల్లో బీజేపీ సమావేశాలు

ఎంవీపీ కాలనీ(విశాఖ తూర్పు): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు భీమవరంలో ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణరాజు తెలిపారు. బుధవారం లాసన్స్‌బే కాలనీలోని పార్టీ నగర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశాల్లో 2024 ఎన్నికల అజెండాను ఆవిష్కరిస్తామన్నారు. సీబీఐ ఏపీకి రావద్దంటూ గతంలో టీడీపీ ప్రభుత్వం జీవోలు విడుదల చేస్తే.. ఇప్పుడు సమావేశాలు పెట్టొద్దంటూ వైఎస్సార్‌సీపీ జీవోలు విడుదల చేస్తుందన్నారు. ఈ నెల 19న జరగాల్సిన వందే భారత్ రైలు ప్రారంభోత్సవం వాయిదా పడిందన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ 45 నెలల పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశాఖను ప్రత్యేక రాష్ట్రం చేయాలంటూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేస్తున్న వ్యాఖ్యలు వ్యక్తిగతమా? లేక ప్రభుత్వ విధానమా? అనే విషయాన్ని స్పష్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర వెంకట శివన్నారాయణ, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పాల్గొన్నారు.

వీనుల విందుగా వీణానాదం

- ప్రారంభమైన త్యాగరాజ ఆరాధనోత్సవాలు
- మృదంగం విద్వాంసుడు వెంకటరమణకు సంగీత కళాభారతి బిరుదు



మృందంగం విద్వాంసుడు వెంకటరమణను సంగీత కళాభారతి బిరుదుతో సత్కరిస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): వీనుల విందుగా సాగిన వీణా నాదం సంగీత ప్రియులను మైమరపించింది. ఒకే వేదికపై షోడశ వీణల(16 వీణలు)పై త్యాగరాజ కృతులతో ఓలలాడించారు. అద్భుత సంగీత కచేరీకి మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం బుధవారం వేదికైంది. త్యాగరాజ ఆరాధనోత్సవాలు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. త్యాగరాజ ట్రస్ట్ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, పంతుల గోపాలరావు.. త్యాగరాజ స్వామి చిత్ర పటం జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రముఖ మృందంగం విద్వాంసుడు వంకాయల వెంకటరమణను సంగీత కళాభారతి బిరుదుతో సత్కరించి, రూ.10 వేలు నగదు ప్రోత్సాహకం అందించారు. ఈ వేదికపై 16 వీణలతో త్యాగరాజ కృతులను వాయిస్తూ ప్రముఖ వీణా విద్వాంసురాలు దివంగత మల్లాప్రగడ జోగులాంబకు నీరాజనాలు పలికారు.

6 రోజులు.. 900 మంది కళాకారులు.. 348 కచేరీలు

ఆరాధనోత్సవాలు జరిగే ఆరు రోజుల్లో 900 మంది కళాకారులతో 348 కచేరీలు నిర్వహించనున్నామని త్యాగరాజ ట్రస్ట్ కార్యదర్శి రాంబాబు తెలిపారు. ఈ నెల 16వ తేదీ వరకూ ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. ముఖ్య అతిథిగా ఆచార్యుడు ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఉప్పొంగిన యువతరంగం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న సంస్థ చైర్మన్ రత్తయ్య

- దువ్వాడ విజ్ఞాన్‌లో ఘనంగా యువజనోత్సవాలు
- రెండు రాష్ట్రాల నుంచి 3,600 మంది విద్యార్థుల హాజరు

అగనంపూడి (గాజువాక): దువ్వాడ విజ్ఞాన్‌లో బుధవారం ప్రారంభమైన విజ్ఞాన్ యువతరంగ్‌లో ఉత్సాహం ఉరకలు వేసింది. ఈ యువజనోత్సవాల్లో రెండు రాష్ట్రాలకు చెందిన ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొని క్రీడలు, సాంస్కృతిక అంశాలలో ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. విజ్ఞాన్ సంస్థల చైర్మన్ రత్తయ్య, ఎస్ఎస్‌టీఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక సామర్థ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపుతాయని, పట్టుదలను అలవరుస్తాయని, ఆలోచనా ధోరణిలో మార్పులు తెస్తాయని, విశాల దృక్పథం అలవడుతుందని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. సంస్థ రెక్టార్ వి.మధుసూదనరావు, సీఈవో శ్రీకాంత్ ప్రసంగించారు. రెండు రాష్ట్రాల్లోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 3వేల 6వందల మంది విద్యార్థులు పాల్గొని క్రీడా, సాంస్కృతిక పోటీల్లో సత్తా చాటారు. కార్యక్రమంలో ఓపెన్ స్కాట్స్ టెక్నాలజీస్ సంస్థ వ్యవస్థాపకులు పి.వినోద్‌కుమార్, విజ్ఞాన్ ఇంజినీరింగ్, ఫార్మా కళాశాల, మహిళా ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ బి.అరుంధతి, వై.శ్రీనివాసరావు, జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, యువతరంగ్ కన్వీనర్ బి.సతీష్, విద్యార్థుల విభాగం కో–ఆర్డినేటర్లు బాలవంశీకృష్ణ, అరవింద్‌స్వామి, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.